

రూ. 10 లక్షల విరాళం
శ్రీశైలంటెంపుల్: కుటీర నిర్మాణ పథకం కింద దేవస్థానం నిర్మిస్తున్న కాటేజీ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం శేరిలింగంపల్లికి చెందిన హర్షవర్ధన్, శ్రీజ దంపతులు రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు.



శనగల బసవన్నకు పూజలు
శ్రీశైలంటెంపుల్: ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు. నానపెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.



బుసకొడుతున్న పాములు!
వర్షాలు కురుస్తుండటంతో భూమిలో దాక్కున్న పాములు బయటకు వస్తున్నాయి. రాళ్లు, గుట్టలు, ముళ్లపొదల మాటున నక్కి ప్రజలను కాటేస్తున్నాయి.
8లో ▸

న్యూస్‌రీల్

ఈ నెల 18 వరకే పెన్షన్‌దారులకు ఈ-కేవైసీ

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులందరూ రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. పెన్షన్‌దారులు తమ సీఎఫ్ఎంఎస్ ఐడీని ఆధార్ నెంబర్‌కు అనుసంధానం చేసుకోవడాన్నే ఈ-కేవైసీగా వ్యవహిస్తారని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 17,005 మంది పెన్షన్‌దారులు ఉండగా.. ఇప్పటి వరకు 15388 మంది ఈ-కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన వారంతా ఈ నెల 18లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇందుకోసం ఆదివారం సెలవు అయినప్పటికీ కర్నూలు సీ.క్యాంపులోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో ఈ-కేవైసీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

కృత్రిమ అవయవాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్న వారు ఆగస్టు 5లోగా 90000 88660, 81425 50143 నెంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించే క్యాంప్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మెడికల్ నిపుణులచే పరీక్షలు నిర్వహించి కొలతలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ.6 కోట్లతో కలెక్టరేట్ మరమ్మతులు



పూర్తిగా దెబ్బతిన్న పైకప్పును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్రతో కలసి కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ, జిల్లా ట్రెజరీ తదితర కార్యాలయాల్లో ఫ్లోరింగ్, పై కప్పు, టాయ్‌లెట్స్, బాత్‌రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు కలెక్టరేట్ మరమ్మతుకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఫ్లోరింగ్, పైకప్పు, టాయ్‌లెట్స్ తదితరాలను మరమ్మతు చేయనున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు: విజిలెన్స్ అధికారులు శనివారం బృందాలుగా ఏర్పడి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, నంద్యాల టౌన్, మిడుతూరు మండలాల్లోని ఎరువులు, క్రిమి సంహార మందుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎమ్మిగనూరులోని చంద్ర ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో స్టాక్ తేడాలు ఉన్నట్లు గుర్తించి 14.725 కేజీల పత్తి విత్తనాలను, మిడుతూరు అగ్రీమాల్‌లో రూ.1.41 లక్షల విలువ చేసే 12.981 మెట్రిక్ టన్నుల ఎరువులను, నంద్యాల లక్ష్మీవెంకటేశ్వర ఎరువుల దుకాణంలో రూ.16,600 విలువ చేసే పురుగు మందుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనిఖీల్లో సీఐలు కేశవ రెడ్డి, సునిల్‌కుమార్, ఏఓ రూపల్, తహసీల్దార్ వెంకటనారాయణ పాల్గొన్నారు.



హక్కున చేర్చుకుని.. ఆనందం పంచి!

- అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,120 మందికి లబ్ధి
- 5,150.57 ఎకరాలకు లభించనున్న స్వేచ్ఛ
- కేబినేట్ నిర్ణయంతో దళితుల్లో వెల్లివిరిసిన సంతోషం

పొలం ఉంది..పంటా పండుతోంది..హక్కు మాత్రం అందడం లేదు..ఎన్నో ఏళ్లుగా దళిత రైతులు ఎదుర్కొంటున్న సమస్య ఇదీ.. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపింది. అసైన్డ్ భూములపై సర్వ హక్కులు కల్పించింది. భూమి కొనుగోలు పథకంలో భాగంగా భూములు పొందిన దళితుల రుణాలు మాఫీ చేసింది. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

కర్నూలు(అర్బన్): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూములు కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఈ నెల 12నజరిగిన కేబినేట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే భూమి కొనుగోలు పథకంలో భాగంగా భూములు పొందిన దళిత రైతుల ఆకాంక్షలు కూడా నెరవేరనున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1989 నుంచి 2008 వరకు దాదాపు 4,120 దళిత కుటుంబాలకు 5 వేల ఎకరాలకు పైగా భూములను మార్జిన్‌మనీ, సబ్సిడీ కింద ఇప్పించారు. ఈ భూములకు సంబంధించిన డాక్యుమెంట్స్ మార్టిగేజ్ కింద ఎస్సీ కార్పొరేషన్ లోనే నేటి వరకు ఉన్నాయి. ఈ భూములను దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నా, యాజమాన్య హక్కులు లేవు. తాజాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 2014 కంటే ముందు ఇచ్చిన భూములకు యాజమాన్య హక్కులు లభించనున్నాయి.

14 ఏళ్ల తర్వాత..

వైఎస్సార్ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.లక్ష లోపు ఉన్న రుణాలన్నింటిని మాఫీ చేస్తు 2009లో జీఓ నంబర్ 492ను జారీ చేశారు. ఈ జీఓ ప్రకారం ఎస్సీ కార్పొరేషన్‌లో మార్టిగేజ్ కింద ఉన్న భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. అయితే వైఎస్సార్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ఈ జీఓ గురించి పట్టించుకోలేదు. దీంతో 14 సంవత్సరాలుగా డాక్యుమెంట్లు ఎస్సీ కార్పొరేషన్‌లోనే మగ్గాల్సి వచ్చింది. కాగా .. గతేడాదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ జీఓపై ఆరా తీయడం, వెంటనే ఎస్సీ కార్పొరేషన్లలో మార్టిగేజ్ కింద భూముల ఒరిజినల్ దస్తావేజులను లబ్ధిదారులకు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే భూమి కొనుగోలు పథకం కింద భూములు పొందిన లబ్ధిదారులు, ఒక వేళ వారు మృతి చెందివుంటే వారసుల వివరాలను వెంటనే పంపించాలని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల్లోని తహసీల్దార్లకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు లేఖలు రాశారు.

చరిత్రాత్మక నిర్ణయం



పేద రైతుల జీవితాలను మార్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. దీంతో అసైన్డ్ భూముల సమస్యతో పాటు భూమి కొనుగోలు పథకంలో భూములు పొందిన వేలాది మంది పేద దళిత రైతు కుటుంబాలకు న్యాయం జరగనుంది. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో ఎస్సీ రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. కార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న భూములకు కూడా స్వేచ్ఛ లభిస్తోంది. దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల చిన్న, సన్నకారు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

– జరదొడ్డి సుధాకర్, ఎమ్మెల్యే, కోడుమూరు

లబ్ధిదారుల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	అందించిన భూములు ఎకరాల్లో
కర్నూలు	1,972	2,832.10
నంద్యాల	2,148	2,318.47
మొత్తం:	4,120	5,150.57

4,120 మందికి యాజమాన్య హక్కులు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎస్సీ కార్పొరేషన్‌లో ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లను దళిత రైతులకు అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 4,120 మంది రైతులకు సంబంధించి రూ.5.26 కోట్ల రుణాలు వైఎస్సార్ హయాంలోనే మాఫీ అయ్యాయి. దళిత రైతుల కష్టాలను తీర్చేందుకు తాజాగా రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5150.57 ఎకరాలకు యాజమాన్య హక్కులు లభించనున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు



తాజాగా కేబినేట్ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాల మేరకు చర్యలు చేపడతాం. గత ఏడాది ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు పొందిన వారి వివరాలను ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లకు లేఖలు రాశాం. ఆయా భూములకు వారసులు ఎవరు ? విస్తీర్ణం ఎంత ? ప్రస్తుతం ఆయా భూములు ఎవరి అనుభవంలో ఉన్నాయి ? థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్స్ ఏమైనా జరిగాయా ? అనే వివరాలను కోరాం.

– ఎస్ శ్రీనివాసకుమార్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

ఎంతో మేలు



గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న భూమికి సంబంధించి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. అప్పట్లో మాకు 1.50 ఎకరాల భూమిని అందించారు. ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాం. అయితే భూమికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం పత్రాలు ఇస్తున్నందుకు మాలాంటి ఎంతో మంది దళితులకు మేలు జరుగుతోంది. – హెచ్ దేవమ్మ, సీ బెళగల్

చాలా సంతోషం



అప్పట్లో మాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1.80 ఎకరాల భూమిని ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్నాం. అయితే ఆ భూమికి సంబంధించి ఇంకా అప్పు ఉండడంతో పత్రాలు ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు అధికారులు మా భూమికి సంబంధించిన ఒరిజినల్ పట్టాలు ఇస్తున్నట్లు చెప్పారు. చాలా సంతోషంగా ఉంది. ఒరిజినల్ పట్టాలు ఉంటే బ్యాంకులో అప్పులు తీసుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

– చిట్టెమ్మ, కే మార్కాపురం, కల్లూరు మండలం

కష్టకాలంలో అండగా..



ఈ చిత్రంలో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ పేరు పింజరి హుసేన్‌సాహెబ్. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన మునెమ్మ అనారోగ్యంతో నడవలేని స్థితిలో మంచపట్టింది. ఐదు సంవత్సరాలుగా ఇదే దుస్థితి. సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో ఆమెకు పింఛన్ వచ్చేది కాదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వలంటీర్ పింజరి హుసేన్‌సాహెబ్.. ఈమె ఇబ్బందులు తెలుసుకున్నాడు. కోవిడ్ కారణంగా బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి సదరం సర్టిఫికెట్ ఇప్పించా డు. మునెమ్మకు పింఛన్ మంజూరు కావడంతో ఇంటికి వెళ్లి ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నాడు. పింజరి హుసేన్‌సాహెబ్ సేవలను గ్రామస్తులు కొనియాడుతున్నారు. – ఎమ్మిగనూరురూరల్

ఇంటి మనిషిలా చూసుకున్నారు



వలంటీర్ పింజరి హుసేన్‌సాహెబ్ ఇంటి మనిషిలా సాయం చేశారు. ఆయన లేకపోతే నాకు పింఛన్ వచ్చేది కాదు. ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. నా యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఇంటిలో వ్యక్తిగా వ్యవహరిస్తున్నాడు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే మాలాంటి వారి పరిస్థితి చాలా అధ్వానంగా ఉండేది.

– మునెమ్మ, బనవాసి

ఆశాజనకంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. సాయంత్రం 7 గంటల సమయానికి కోసిగి మండలంలో 31.5 మి.మీ వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ మొదలై 45 రోజులు గడిచినా ఇప్పటికీ వర్షాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. జూన్ నెలలో 40 శాతం లోటు వర్షపాతం ఉంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా 15 రోజులు గడచినప్పటికీ 25.9 మి.మీలకు మించని పరిస్థితి. వర్షాలు లేకపోవడం వల్ల సాగైన పంటలు కూడా దెబ్బతింటున్నాయి. రైతులు గ్రామాల్లో వర్షాల కోసం అభిషేకాలు, కప్పలకు పెళ్లిళ్లు టెంకాయల పందేలు తదితర కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలు కోలుకునే అవకాశం ఏర్పడింది. మంత్రాలయం, కోడుమూరు, కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, గోనెగండ్ల, నందవరం, గూడూరు, వెల్దుర్తి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాలు మరింత ఆశాజనకంగా కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

5,75,518 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా

- బీమా నమోదులో రాష్ట్రంలో కర్నూలు జిల్లాకు 2వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 2023-23 సంవత్సరానికి సంబంధించి 5,75,518 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా సదుపాయం లభించింది. రైస్ కార్డు కలిగిన కుటుంబాల్లో 18 ఏళ్ల పైబడిన వారి కుటుంబాలకు, 70 ఏళ్లలోపు వారి కుటుంబాలకు మాత్రమే వైఎస్ఆర్ బీమా వర్తిస్తుంది. జిల్లాలో రైస్ కార్డులు 6,16,089 ఉన్నాయి. వైఎస్ఆర్ బీమా పొందడానికి ప్రధాన అర్హత రైస్‌కార్డు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 5,75,518 కుటుంబాల్లో ఇంటికి ఆధారమైన వారిని వైఎస్ఆర్ బీమా కింద నమోదయ్యారు. 18 నుంచి 50ఏళ్ల లోపు వారు సాధారణంగా మరణిస్తే రూ.1 లక్ష, 18 నుంచి 70 ఏళ్లలోపు వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం లభిస్తుంది. 2022-23 సంవత్సరంలో 5,05,094 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా వర్తించింది. 2022-23తో పోలిస్తే 2023-24 సంవత్సరంలో 70,424 కుటుంబాలకు అదనంగా వైఎస్ఆర్ బీమా సదుపాయం లభించింది. ఈ ఏడాది వైఎస్ఆర్ బీమా నమోదులో రాష్ట్రంలో కర్నూలు జిల్లా రెండవ స్థానంలో నిలిచినట్లుగా డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ స్పందన కార్యక్రమం కొనసాగుతుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడారంగానికి సీఎం పెద్ద పీట

- మంత్రి ఆర్. కే రోజా

నందికొట్కూరు/పగిడ్యాల: క్రీడా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కే రోజా పేర్కొన్నారు. శనివారం పట్టణంలో, పగిడ్యాలలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాలను మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వీరికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు నీరాజనం పలికారు. నందికొట్కూరు పట్టణంలో 2 వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. క్రేన్ సహాయంతో వారికి గజమాల చేసి అభిమానాన్ని చాటారు. అనంతరం పట్టణంలో రూ.1.19 కోట్లతో, పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.1.18 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించేందుకు సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ శశికళ, శాప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటరమణ, చీఫ్ కోచ్ రాజు, ఆత్మకూరు ఆర్డీఓ దాసు, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్‌లు భారతి, రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఏడీ శ్రీనివాసులు, నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కోఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



కలగలసి.. కమ్మని రుచి

వారంతా కాయకష్టం చేసే కూలీలు..ఇంటి నుంచి తెచ్చుకున్న సద్దులన్నీ విప్పి కలగలిపారు. మంచీ చెడూ మాట్లాడుకుంటూ అందరూ ఒకే చోట కూర్చుని కమ్మనైన భోజనాన్ని ఆరగించారు. శనివారం ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామ సమీపంలోని పొలంలో ఈ దృశ్యం కనిపించింది. - ఆస్పరి

ఒకే కుటుంబంలో ముగ్గురికి పాము కాటు

- బాలుడు మృతి..
- మరొకరి పరిస్థితి ఆందోళనకరం

గోనెగండ్ల: కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామంలో ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు గురువారం తెల్లవారుజామున పాము కాటుకు గురయ్యారు. వీరిలో శ్రీనివాసులు(10) అనే బాలుడు శుక్రవారం మృతి చెందాడు. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. బైలుప్పల బీసీ కాలనీలో బుర్నా గోవింద్, చంద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు దొరస్వామి, బాలకృష్ణ సంతానం. వీరికి వివాహాలు అయినా ఒకే ఇంట్లో ఉమ్మడిగా ఉంటున్నారు. గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము ఇంట్లోకి ప్రవేశించి దొరస్వామి, అతని ఎనిమిది నెలల కుమారుడిని, అలాగే బాలకృష్ణ కుమారుడు శ్రీనివాసులును కాటు వేసింది. కుటుంబ సభ్యులు దొరస్వామి, ఎనిమిది నెలల బాలుడిని మాత్రమే పాము కాటు వేసిందని భావించి గురువారం తెల్లవారు జామున చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఇంటి దగ్గరే ఉన్న శ్రీనివాసులు పరిస్థితి విషమించింది. గమనించిన కాలనీ వాసులు వెంటనే కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. దొరస్వామి పరిస్థితి కూడా ఆందోళన కరంగా ఉండటంతో ఎమ్మిగనూరును నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రి తరలించారు. ఎనిమిది నెలల బాలుడు క్షేమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

పాఠశాలలో పాము కలకలం

డోన్ టౌన్: మండల పరిధిలోని మల్లెంపల్లె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం సృష్టించింది. మధ్యాహ్నం విద్యార్థులంతా పాఠశాల ఆవరణలో భోజనం చేస్తుండగా చెట్టుపై నుంచి పాము కింద పడింది. విద్యార్థులంతా భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఆ సమయంలో పక్కన ఉన్న చెట్టు కొమ్మలు గీసుకుని ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా పాము పడిన ఆ ప్రాంతంలో ఆ విద్యార్థులు ఉండటంతో పాము కాటు వేసిందేమోనని అనుమానంతో ప్రధానోపాధ్యాయుడు చాంద్‌బాషాతో పాటు ఉపాధ్యాయులు వెంటనే ఆరుగురు విద్యార్థులను డోన్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేయించిన తర్వాత ఎలాంటి అపాయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. అయినా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు అనుమానిత విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించి ప్రమాదం లేదని చెప్పిన తర్వాత అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బుసకొడుతున్న పాములు!

- ఈ నెలలో ఇప్పటికే పాముకాటుతో ఇద్దరు మృతి
- మరికొందరు ఆసుపత్రి పాలు
- వర్షాలకు బయటకు వస్తున్న సర్పాలు
- పొలాలు, పొదల్లో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పాముకాటు మందులు



కర్నూలు(హాస్పిటల్): కాస్త ఆలస్యంగానైనా వర్షాలు మొదలయ్యాయి. వాతావరణంలో వేడి తగ్గి భూమి చల్లబడుతోంది. ఈ తరుణంలో భూమిలో దాక్కున్న విషపురుగులు బయటకు రావడం సహజం. ఇలా బయటకు వచ్చిన విషసర్పాలు, పురుగులు రాళ్లు, గుట్టలు, ముళ్లపొదల మాటున నక్కి ఉంటాయి. వాటికి ప్రమాదం వస్తుందని భావిస్తే వెంటనే కాటేస్తాయి. ఈ నెలలో ఇప్పటి వరకు పది మందికి పాములు కాటు వేయగా అందులో ఇద్దరు మృతి చెందారు. పాము కాట్లకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో యాంటిస్నేక్ వీనమ్ మందులు అందుబాటులో ఉంచారు. వీటిని పాముకాటు బాధితులకు ఉచితంగా వేస్తున్నారు. అయితే పాము కాటు వేసిన వెంటనే ఆందోళనకు గురికావడం ప్రమాదకరం. ప్రథమ చికిత్సపై అవగాహన లేక సొంత వైద్యం చేసుకోవడం అపాయకరం. నాటు వైద్యాన్ని నమ్ముకుని కొందరు పాముకాటు బాధితులను ఆసుపత్రికి తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

అన్ని పాము కాట్లు విషపూరితం కాదు

- తాచు పాము, కట్ల పాము వంటి 15 శాతం పాములే ప్రమాదకరమైనవి.
- అన్ని పాముకాట్లు ప్రమాదకరమైనవి కాకపోవచ్చు. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషంలేని, ప్రమాదంలేని మామూలు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే ఈ గాయాలు నయం అవుతాయి.
- పాము విషం కన్నా చాలా మంది షాక్, ఆందోళనతోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు.

సాధారణంగా విష సర్పం కాటులో ఈ లక్షణాలు కనిపించవచ్చు.

- కాటు ప్రదేశంలో పాము కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు, చొంగకారవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

విషసర్పం కాటు..లక్షణాలు

సాధారణంగా తాచు పాము విష ప్రభావం శరీరంలో ప్రవేశానికి కొంత వ్యవధి తీసుకుంటుంది. నల్లతాచు(కింగ్‌కోబ్రా) విషం ప్రభావం చాలా త్వరగా కనిపించి ప్రాణాంతకంగా ఉంటుంది. కట్లపాము కాటు బాధ ఒకరకమైతే, రక్తపింజర విష లక్షణాలు మరో రకంగా ఉంటాయి.

ఇలా చేయాలి..

- పాము కరవగానే భయాందోళనకు గురిగాకుండా ధైర్యంగా ఉండాలి. బంధుమిత్రులు కూడా వారికి ధైర్యం చెప్పాలి.
- పక్కనున్న వారు ఆ పాము విషసర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దానివల్ల చికిత్స మరింత కచ్చితంగా అందజేయవచ్చు.
- నాటు వైద్యం, మంత్రతంత్రాల జోలికి వెళ్లకుండా సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆసుపత్రికి రోగిని నడిపించకుండా తీసుకెళ్లాలి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో యాంటి స్నేక్ వీనమ్(పాము కాటు మందులు) అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండని కారణంగా తక్కువ పరిమాణంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిల్వ ఉంచుతారు. మందుల కొరత ఏర్పడితే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి అత్యవసరంగా కొనుగోలు చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఎక్కడా మందుల కొరత లేదు. అయితే అందరికీ ఈ ఇంజెక్షన్ వాడాల్సిన అవసరం లేదు. విషపూరిత పాము కాటు వేసిన వారికి మాత్రమే వాడాలి. –రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

నిర్లక్ష్యం చేయొద్దు



పాము కాటువేసిన చోట తాళ్లతో కట్టడం వల్ల రక్తసరఫరా తగ్గి ఆ ప్రాంతం కుళ్లిపోయే ప్రమాదం ఉంది. కుట్టిన చోట శుభ్రం చేసి, ప్రథమ చికిత్స చేయించాలి. కట్ల పాము, నాగుపాము కాటువేస్తే నాడీవ్యవస్థపై ప్రభావం చూపి బాధితుడు కోమాలోకి వెళ్తాడు. కళ్లు సరిగ్గా కనిపించవు. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కావడం వల్ల గొంతులో కండరాలు బిగుసుపోయి నోట్లో నురగ వస్తుంది. ఫిట్స్ కూడా వస్తాయి. రక్తపింజరి కాటు వేయడం వల్ల రక్తం పల్చగా మారి మూత్రం, చిగుళ్లలో రక్తస్రావం జరుగుతుంది. పాము కాటు వేయగానే నిర్లక్ష్యం చేయకుండా సాధ్యమైనంత త్వరగా ప్రథమ చికిత్స చేయించి, ఆసుపత్రిలో చేర్చాలి.
–డాక్టర్ ఎ. అనిల్, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

కర్నూలు నగరపాలక సంస్థ
ప్రకటన

నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ యువత మరియు పిల్లలతో సమయాన్ని గడిపేందుకు వీలుగా కర్నూలు నగర పాలక సంస్థ బిర్లా గేటు ఫ్లై ఓవర్ క్రింద కర్నూలు ఖానా ఖజాన (ఈట్ స్ట్రీట్) ను అభివృద్ధి చేసింది. ఇక్కడ పిల్లలు ఆడుకొనుటకు ఆట వస్తువులు, యువత కొరకు సెల్ఫి స్పాట్‌తో సహా ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

ఖానా ఖజానా (EAT - STREET) నందు వ్యాపార నిర్వహణ కొరకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది

ఇందుమూలముగా కర్నూలు నగరములోని ఆహార పదార్థాల తయారీ మరియు నిర్వహణ చేయు వ్యాపారస్తుల నుండి క్రింద తెలుపబడిన వ్యాపార విభాగములందు వ్యాపారము నిర్వహించుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఈట్ స్ట్రీట్ నందు నిర్వహణ ఆహార వ్యాపార విభాగాలు / (కేటగిరిలు)	కోడ్ నెం.	లభ్యత యూనిట్స్	విస్తీర్ణము అడుగులలో	నెలసరి అద్దె (రూ.)
1.	చాట్ బండారు యూనిట్: (సమోసా, పావ్‌బజ్జి, బేల్‌పూరి, మసాలాపూరి)	K.K.-1	2	15x10	10,000/- (జి.యస్.టి.) అదనము)
2.	పిజ్జా మరియు బర్గర్ యూనిట్	K.K.-2	2		
3.	ఐస్ పార్లర్ యూనిట్: (షుగర్ క్యాండి,చాక్లెట్ ఐస్, మొదలగునవి)	K.K.-3	2		
4.	బిరియానీ పాయింట్: (చికెన్,మటన్ మరియు ఫిష్ మొదలగునవి)	K.K.-4	2		
5.	శాకాహార ఫలహారశాల: (ఇడ్లీ,వడ,పూరి, దోసె, పొంగల్ మొదలగునవి)	K.K.-5	2		
6.	జ్యూస్ సెంటర్: (ఫ్రూట్ జ్యూస్, వెజిటబుల్ జ్యూస్, లస్సి, సోడా, షుగర్ కేన్ మొదలగునవి)	K.K.-6	2		
7.	కాఫీ టీ యూనిట్	K.K.-7	2		

నిర్వహణ కాలము	1 సంవత్సరము
వేలములో పాల్గొనుటకు ధరావత్తు మొత్తము	రూ. 30,000/- (డి.డి.రూపములో)
అప్లికేషను సమర్పించుటకు చివరి తేది	22.07.2023 సా॥ 5.00 గం॥ల లోపు
అప్లయ్ చేయు ప్రదేశము	మేనేజరు, నగరపాలక సంస్థ, కర్నూలు

ముఖ్య గమనిక
ఏదైనా బ్రాండ్ /ఫ్రాంచాయిస్ ఉన్న యెడల వారికి ప్రత్యక్షముగా కేటాయింపు చేయబడును.
నగర పాలక సంస్థ సూచించిన నమూనా కియోస్క్‌ను మాత్రమే అక్కడ ఏర్పాటు చేయవలెను. సంబంధిత ఏర్పాటు మరియు నిర్వహణ ఖర్చులు వారే భరించవలెను. దానికి విరుద్ధముగా ప్రవర్తించినచో ఎటువంటి నోటీసు లేకనే తొలగించబడును.
ఒకరు ఒక్క కేటగిరికి మాత్రమే దరఖాస్తు చేయవలెను.
ఒకరికంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నచో లాటరి పద్ధతిన కేటాయించబడును.

లాటరి నిర్వహించు స్థలము : కర్నూలు నగర పాలక సంస్థ పాత కౌన్సిల్ హాల్
తేది / సమయం : 25.07.2023 ఉదయం 11.00 గంటలకు

- ఆహార కల్తి నిరోధక చట్టం ప్రకారము నియమాలు పాటిస్తూ నాణ్యత గల ఆహార పదార్థాలు మాత్రమే విక్రయించవలెను మరియు MRP ధరపైన విక్రయం జరపవలెను.
- ఈ యొక్క కేటాయింపు కేటాయించుటకు మరియు తిరస్కరించుటకు కమీషనరు గారు పూర్తి హక్కు కలిగియుండును. ఎలాంటి వాగ్వివాదాలకు తావు లేదు.
- నమూనా దరఖాస్తు ఫారం నగర పాలక సంస్థ కార్యాలయము నుండి పొందవచ్చును.

ఇతర వివరముల కొరకై ఆఫీసు పనివేళల యందు రెవిన్యూ అధికారిని గాని రెవిన్యూ విభాగమునందు గాని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, కర్నూలు నగరపాలక సంస్థ, కర్నూలు

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ కృష్ణకాంత్

కృష్ణగిరి: జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాల్లో గస్తీ పెంచామన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి చెప్పుకోవచ్చన్నారు. పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మాట్కా, పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను, పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ ఆర్. సురేష్ ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వెల్దుర్తి: పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ జి కృష్ణకాంత్ అన్నారు. శనివారం ఆయన వెల్దుర్తి సర్కిల్ ఆఫీస్, పోలీస్‌స్టేషన్, చెరుకులపాడులోని పికెటింగ్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు పరిశీలించారు. వెల్దుర్తిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. చెరుకులపాడులో పికెటింగ్ విధులకు గైర్హాజరైన ఏఆర్ కానిస్టేబుల్ రఫీని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.



కృష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో నోటీస్ బోర్డును పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

మాట వినలేదని మట్టుబెట్టాడు!

- భార్యను కడతేర్చిన భర్త
- రామాపురంలో దారుణం



హత్యకు గురైన పద్మావతి

తుగ్గలి: తోడూనీడగా ఉంటానని ప్రమాణం చేసిన భర్తే ఆ ఇల్లాలి పాలిట కాలయముడయ్యాడు. చిన్న విషయానికే మూడుముళ్ల బంధానికి తూట్లు పొడిచాడు. కూతురు పెళ్లి విషయంలో తన మాట వినలేదనే కారణంతో నిద్రలో ఉండగా భార్యను గొడ్డలితో దారుణంగా నరికి కడతేర్చాడు. ఈ ఘటన తుగ్గలి మండలం రామాపురంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపిన వివరాల మేరకు.. రామాపురానికి చెందిన వెంకటేష్‌కు గుంతకల్లు మండలం ములకలపెంట పద్మావతి(36)తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు శైలజను గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన యువకునికి ఇచ్చి పెళ్లి చేయాలని వెంకటేష్ నిశ్చయించాడు. అయితే 20 రోజుల క్రితం శైలజ ఇంటి నుంచి వెళ్లిపోయి వరుసకు మేనమామ అయిన ములకలపెంటకు చెందిన యువకున్ని పెళ్లి చేసుకుంది. దీనికంతటికీ తన భార్యే కారణమని భావించిన వెంకటేష్ రోజూ గొడవ పడేవాడు. కూతురు పెళ్లి విషయంలో తన మాట వినలేదని ఆగ్రహంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిద్రలో ఉన్న భార్యను మెడపై గొడ్డలితో నరికి చంపి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు శనివారం ఉదయాన్నే ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు

- సి.క్యాంపు రైతుబజారులో కిలో బియ్యం రూ.51
- ఒక్కొక్కరికి 5 కిలోల పంపిణీ
- ఈ నెల 17 నుంచి అందుబాటులో కందిపప్పు, మినపప్పు

కర్నూలు(అగ్రికల్చర్): నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఊరట కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కర్నూలు, కొత్తపేట రైతుబజార్లలో సన్న బియ్యం, కందిపప్పు, మినపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శనివారం సాయంత్రం కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో ప్రత్యేక కౌంటర్‌ను డీఎస్‌ఓ సత్యనారాయణాచార్యులు ప్రారంభించారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే పెట్టామని, సోమవారం నుంచి కందిపప్పు, మినపప్పు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు. మొదటి రకం సోనా మసూరి బియ్యం కిలో రూ.51 ప్రకారం ఒక్కొక్కరికి 5 కిలోల వరకు పంపిణీ చేస్తామన్నారు. మొదటి రకం కందిపప్పు రూ.140, మినపప్పు రూ.110 ప్రకారం ఒక్కొక్కరికి కిలో చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతలు రాంచంద్రారెడ్డి, బ్రహ్మయ్య, ప్రసాద్, సురేష్‌రెడ్డి, ట్రేడర్స్ సంఘం ప్రతినిధి చంద్రమోహన్‌ప్రతాప్, రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

మహానందిలో క్యూలైన్ల ఆధునికీకరణ

మహానంది: మహానంది క్షేత్రంలో రూ.25 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో క్యూలైన్లను ఆధునికీకరిస్తున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి శనివారం స్టీల్ క్యూలైన్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ ఉచిత, రూ.పది ఆర్జితసేవా టికెట్ల మార్గంలో భక్తుల సౌకర్యార్థం స్టెయిన్‌లెస్ స్టీల్‌తో క్యూలైన్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు పూర్తయిన వెంటనే ఆలయంలో బ్రాస్‌తో మరిన్ని ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ధర్మకర్త మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.